

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


మద్యం దుకాణాల వద్ద ఫ్లెక్సీల నిషేధం



4లో


Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 155 | పేజీలు - 04 | వెల - 05/- | గురువారం 04-06-2026




# ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు-యోగా నెలగా జూన్**


- జిల్లాకో ప్రత్యేక థీమ్... టూరిజం ప్రాంతాల వేదికగా యోగా డే
- పవన్ కళ్యాణ్ పై తెలంగాణ నేతల వ్యాఖ్యలు సరి కావు
- ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు
- డీఎస్సీ నిర్వహణ అనేది టీడీపీ బ్రాండ్
- మంచి పనులపై బురద జల్లడమే కొందరు పనిగా పెట్టుకున్నారు
- మీడియా కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, జూన్ 3: ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కోటి మందితో ఈ నెల 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా యోగా డే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. యోగాంధ్ర -2026 కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే కార్యక్రమాలను ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో వివరించారు. అలాగే ఇటీవల జరుగుతున్న పరిణామాల పైనా మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా. జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, అనారోగ్య సమస్యలకు యోగా బెస్ట్ మెడిసిన్. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసాన్ని అందించే సమగ్ర ఆరోగ్య సాధన యోగా. యోగాను మన జీవన విధానంలో భాగం చేసేందుకు యోగాంధ్ర ద్వారా ప్రయత్నిస్తున్నాం. ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర-2026' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యం. ఈ ఏడాది 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ "శీస్త్రు టశీతీ ఎముశ్రీస్త్రప ాూస్త్రఱఅస్త్ర'. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించేందుకు యోగాను అనుసరించాలని చెప్పడమే థీమ్ ఉద్దేశం. ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతి ఇంట్లో, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా

మిగతా 2లో

# సీఎం తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

- తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు
- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ



తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

మిగతాది 2లో

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరిన జగన్



- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్
- వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి
- క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ

డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని,

# డిఎస్సీ 2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం రాష్ట్ర హోంమంత్రి అనిత



- చిత్తశుద్ధి, ప్రజలకు జవాబుదారిగా ఈ ప్రభుత్వం నిలుస్తుంది
- డిఎస్సీపై ఎడాది పూర్తవుతున్న తరుణంలో ఇప్పుడు రాద్ధాంతం చేయడం హాస్యాస్పదం
- స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు పబ్లిక్ డోమైన్ లో ఉంచాము
- అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు

# ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలి




- పురపాలక సంఘాల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించా
- ఖర్చు చేసే ప్రతి రూపాయి ఆన్‌లైన్‌లో కనిపించాలి
- పట్టణాభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం

విజయవాడ, జూన్ 3: ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల అమలులో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి, కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ పనుల్లో ఎదురయ్యే భూ, సాంకేతిక, ఏజెన్సీ

మిగతాది 2లో

# తోతపూరి మామిడి

**రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది**



- రైతులకు న్యాయమైన ధర కల్పించేందుకు చర్యలు
- నాణ్యమైన ప్రతి పండును కొనుగోలు చేస్తాం
- రైతుల నుంచే నేరుగా కొనుగోళ్లు చేయాలని ప్రాసెసింగ్ యూనిట్లకు ఆదేశం

అమరావతి, జూన్ 3: తోతపూరి మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి న్యాయమైన ధర లభించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. తోతపూరి మామిడి సీజన్ పరిస్థితులు, పల్ప్ ప్రాసెసింగ్, కొనుగోళ్లపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో తోతపూరి సాగు జరుగుతోందన్నారు.

మిగతాది 2లో



# పెరగనున్న భూముల విలువలు.. జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

- భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ
- పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్టు తెలిపిన మంత్రి పొంగులేటి
- వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్టు వెల్లడి

తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం.. హాజరైన రాహుల్, ఖర్గే

**అందరినీ కలుపుకుని పనిచేస్తానని సోనియాకు హామీ ఇచ్చిన డీకే**



- ప్రమాణం చేయించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్
- కేబినెట్లో సిద్ధరామయ్య తనయుడికి చోటు
- ప్రమాణానికి ముందు డీకేకు ఫోన్ చేసిన సోనియా గాంధీ

2

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణం చేయించారు. డీకే శివకుమార్ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు. డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలి: మంత్రి నారాయణ

విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ




సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ పనుల్లో ఎదురయ్యే భూ, సాంకేతిక, ఏజెన్సీ సమస్యల పరిష్కారమే వర్క్‌షాప్ లక్ష్యమన్నారు.
పురపాలక సంఘాల్లో ప్రతి నెల లేదా 15 రోజులకోసారి జోన్‌ల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, దీనివల్ల సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని చెప్పారు. గత ప్రభుత్వం ఏఐఐబీ ద్వారా మంజూరైన నిధులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించలేదని విమర్శించారు.
స్వచ్ఛ భారత్, గ్రీన్ కార్పొరేషన్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన మంత్రి, మురుగునీటి శుద్ధి ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఖర్చు చేసే ప్రతి రూపాయి ఆన్‌లైన్‌లో నమోదు కావాలని ఆదేశించారు. వర్షాకాలానికి ముందే నీటి కాలుష్య నివారణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్‌టీపీ ప్లాంట్ల ఏర్పాటు, వ్యర్థాల నిర్వహణ, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టుల అమలులో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ, నెల్లూరు, కొండపల్లి ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 70 కొత్త అన్న క్యాంటీన్లు ప్రారంభించామని, మరో ఐదు క్యాంటీన్లు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన వ్యర్థాల్లో అధిక భాగాన్ని తొలగించినట్లు వెల్లడించారు.
ఏపీయూడీఐఎఫ్‌సీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి వందలాది ప్రాజెక్టులను అమలు చేస్తోందన్నారు.
ఏపీయూడీఐఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పట్టణ మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వర్క్‌షాప్‌లో అమృత్ 2.0, ఎస్‌బీఎం 2.0, యూఐడీఎఫ్ తదితర పథకాల అమలు, నిధుల వినియోగం, ప్రాజెక్టుల పర్యవేక్షణపై అధికారులకు అవగాహన కల్పించారు.

# తోతపూరి మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి అచ్చెన్నాయుడు

తోతపూరి మామిడి సీజన్ పరిస్థితులు, పల్ప్ ప్రాసెసింగ్, కొనుగోళ్లపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో తోతపూరి సాగు జరుగుతోందన్నారు. వేలాది మంది రైతుల జీవనోపాధి ఈ పంటపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. మామిడి పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు వ్యాపారుల ద్వారా కాకుండా నేరుగా రైతుల నుంచే పండ్లను కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించారు. పూర్తిగా పరిపక్వత చెందిన నాణ్యమైన ప్రతి పండును కొనుగోలు చేస్తామని, రైతులకు మార్కెట్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఒకేసారి కోతలు చేపట్టకుండా దశలవారీగా కోతలు నిర్వహించాలని రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. దీనివల్ల ధరలు స్థిరంగా ఉండటంతో పాటు నాణ్యత కూడా మెరుగవుతుందన్నారు. తమిళనాడులోని కృష్ణగిరి మార్కెట్‌లో నమోదవుతున్న తక్కువ ధరల అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందని, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సమాన ధరల విధానం కోసం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ అధికారులు మామిడి ఆధారిత విలువ వృద్ధి ఉత్పత్తుల తయారీపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మామిడి తొక్కలు, గింజల వ్యర్థాల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది సుమారు 7.80 లక్షల మెట్రిక్ టన్నుల తోతపూరి ఉత్పత్తి నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో తోతపూరి మామిడి ధర కిలోకు రూ.7 నుంచి రూ.7.50 వరకు కొనసాగుతోందని తెలిపారు. పల్ప్ పరిశ్రమల ప్రతినిధులు మాట్లాడుతూ తోతపూరి రైతులకు అండగా నిలుస్తామని, గత ఏడాదిలా కాకుండా ఈసారి ఎక్కువ కాలం కొనుగోళ్లు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# డిఎస్సీ 2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం రాష్ట్ర హోంమంత్రి అనిత

అమరావతి,జూన్ 3:డిఎస్సీ 2025ను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత అన్నారు.ఏపీ సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారిగా పని చేస్తుందని తెలిపారు.గత ప్రభుత్వం కనీసం ఒక్క డిఎస్సీ ని కూడా నిర్వహించ లేకపోయిందని ఎన్నికలకు 60 రోజుల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ కేవలం 6100 పోస్ట్ లతో వేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.కాని మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ నిర్వహించారని తెలిపారు.8 సంవత్సరాల నిరీక్షణ అనంతరం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే ఇప్పుడు దాదాపు 8, 9 నెలల తరువాత రాద్ధాంతం చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో డిఎస్సీలు సమర్థవంతంగా నిర్వహించారని, ఆయా డిఎస్సీల ద్వారా ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల మంది ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారని మంత్రి అనిత గుర్తు చేశారు.వాస్తవంగా రాష్ట్రంలో సుమారు 3.11లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే వారిలో 60 శాతం మంది ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ఉద్యోగాలు సాధించారన్నది తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. అంతెందుకు తాను సైతం 2001లో డిఎస్సీ ద్వారానే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని 12 సంవత్సరాల సర్వీసు తర్వాత రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడం జరిగిందని తెలిపారు.అందుకనే నా అనుభవంతో చెబుతున్నాను డిఎస్సీ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్స్ ఎలా జరుగుతాయో నాకు తెలుసని స్పష్టం చేశారు.ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ జరుగుతుందన్నారు.డిఎస్సీ 2025 నిర్వహణకు ప్రభుత్వం 240కి పైగా కోర్టు కేసులు దాటుకుని సుమారు 148 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 16,347 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని చెప్పారు.అంతేకాకుండా 15వేలకు పైగా టీచర్ పోస్ట్ లు అతి గౌరవంగా వారికి అందించడం జరిగిందన్నారు.
ఒకసారి అలోచిస్తే డిఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి అభ్యర్థులు తమ కుటుంబాలకు దూరంగా ఎక్కడో సుదూర ప్రాంతాల్లో కోచింగ్ తీసుకుని మరీ సిద్ధం అవుతారన్నది వాస్తవమని అన్నారు.నెలలు సంవత్సరాల తరబడి శిక్షణ పొంది పరీక్ష వ్రాసి ఎంపికై సగౌరవంగా ఉద్యోగంలో చేరతారన్నది నిజమని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి తన చేతుల మీదుగా డిఎస్సీ అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్ లు అందించి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు.ఒక ఎమోషనల్ బాండింగ్ ఉన్న డిఎస్సీ పై అవాకులు చవాకులు పేలడం దారుణమన్నారు.నిబంధనల మేరకు డిఎస్సీ నిర్వహించి మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ నిర్వహించి, గ్రీవెన్స్ లో 34 వేలకు పైగా గ్రీవెన్స్ వస్తే వాటి అన్నింటిని పరిష్కరించి ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా డిఎస్సీ నిర్వహించామన్నారు.అత్యంత పకడ్బందీగా టీసీఎస్ ద్వారా దాదాపు 43వేల ప్రశ్నలను సిద్ధం చేసి మరీ డిఎస్సి నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని మంత్రి అనిత తెలిపారు.
3 శాతం రిజర్వేషన్ అంటే 421 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించారని అయితే కేవలం అర్హులు 382 మందిని మాత్రమే భర్తీ చేయడం జరిగిందన్నారు.ఎంపికైన వారి సర్టిఫికెట్లను పబ్లిక్ డొమైన్ లో కూడా పెట్టడం జరిగిందని అవసరమైన వారు వాటిని పరిశీలించుకోవచ్చని అన్నారు.స్పోర్ట్స్ కోటా అయినా విద్యార్హతలు మాత్రం తప్పని సరి అని అవి కూడా 15 మంది సభ్యుల బృందం పరిశీలించి మరీ ఎంపిక చేయడం జరిగిందన్నారు.స్పోర్ట్స్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల క్రీడా సర్టిఫికెట్లను ఫెడరేషన్ లు,అసోసియేషన్ లకు పంపించి వెరిఫై చేసి ఆ తర్వాత హరిజంటల్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. బ్రిడ్జి స్పోర్ట్స్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలకు లోబడే ఆథరైజ్డ్ గా తీసుకోవడం జరిగిందన్నారు.బ్రిడ్జి స్పోర్ట్స్ ను ఏషియన్ గేమ్స్ 2018, 2022లో కూడా నిర్వహించారన్నారు. ఇందులో ఇండియా కు కాంస్య పతకం సైతం వచ్చిందన్నారు.గత ప్రభుత్వం గ్రూప్-1 ను అనేక అవకతవకలతో నిర్వహించి అభాసుపాలయిందని అటువంటి సంఘటనలు చంద్రబాబు పాలనలో ఒక్క సంఘటనైనా చూపాలని మంత్రి అనిత డిమాండు చేశారు.

# సీఎం తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు.భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

## పెరగనున్న భూముల విలువలు.. జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు. కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు. ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరిన జగన్

కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు. క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం.. హాజరైన రాహుల్, ఖర్గే

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, మల్లు భట్టివిక్రమార్క తదితరులు హాజరయ్యారు. డీకే శివకుమార్ కేబినెట్‌లో మాజీ సీఎం సిద్ధరామయ్య తనయుడు యతీంద్రకు చోటు దక్కింది. పరమేశ్వర ఏకైక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక కొత్త మంత్రివర్గంలో 12 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని డీకే శివకుమార్ వెల్లడించారు. పార్టీలో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆమె సూచించినట్లు తెలిపారు. తన నాయకత్వంపై సోనియా గాంధీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ, "సోనియా గాంధీ నాతో ఫోన్‌లో మాట్లాడారు. మొదటి నుంచి నాపై ఆమెకు చాలా నమ్మకం ఉంది. నన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది సోనియానే. అందరినీ కలుపుకుని పనిచేయాలని ఆమె సూచించారు. ఆమె నమ్మకాన్ని నిలబెడతానని, అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని నేను హామీ ఇచ్చాను" అని వివరించారు.

# ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



అమరావతిలో జరిగే ప్రధాన కార్యక్రమంలో కృష్ణానది వెస్ట్ బైపాస్ వంతెనపై 25 వేల మందితో యోగా ప్రదర్శన నిర్వహిస్తాం. ప్రతి జిల్లాకు ప్రత్యేక థీమ్ నిర్ణయించాం. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మంది పాల్గొనే కార్యక్రమాలు నిర్వహిస్తాం. రాష్ట్రంలోని 56 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించి యోగా-టూరిజాన్ని ప్రోత్సహిస్తాం. ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి చారిత్రక ప్రాంతాలు వేదికలుగా ఈ యోగా కార్యక్రమం చేపడుతున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**విద్యాభ్యాసంతో పాటు యోగాభ్యాసానికి ప్రాధాన్యత**

"యువతలో, మహిళల్లో, విద్యార్థుల్లో యోగా పట్ల ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా యోగాను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేస్తాం. ప్రస్తుతం ఉన్న ట్రైనర్ల సంఖ్యను 2.50 లక్షలకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టాం. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాం. జిల్లా స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రచారం, నిర్వహణ ఏర్పాట్లకు ఈ నిధులు వినియోగిస్తాం. అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశాం. యోగాను ఒక్కరోజు కార్యక్రమంగా పరిమితం చేయకుండా 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తాం. రాష్ట్రంలో ఒక కోటి మంది క్రమం తప్పకుండా యోగా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఏపీ యోగా ప్రచార పరిషత్, సంజీవని యాప్, హ్యాబిల్డ్ వాట్సాప్ కమ్యూనిటీల ద్వారా నిరంతర శిక్షణ చేపడుతున్నాం. జూన్ నెల మొత్తాన్ని 'యోగా నెల'గా ప్రకటించాం. దీనిని సక్సెస్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సాయం తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికి యోగా చేరేలా మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు రూపొందించారు. సాధారణ యోగా ఆసనాలు, వ్యాధి నివారణ, రోజువారీ సాధన, యోగా సందేహాలకు సమాధానాలు వంటి అంశాలపై 168కు పైగా వీడియోలు అందుబాటులో ఉన్నాయి. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌ ఉచితంగా ప్రజలకు చేరువ చేయాలి. వాట్సాప్ నంబర్ 81424 04888కు 'ఎఅ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు వస్తాయి. స్కూళ్లు, కాలేజీల్లో యోగాను చదువులో భాగం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయగలిగితే ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దగలం. యోగాంధ్ర-2026 కోసం యోగాంధ్ర పోర్టల్‌ను ప్రారంభించాం. ఎశీస్త్రుఅస్త్రతీఖ.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా కార్యక్రమాల వివరాలు, వీడియోలు, నమోదు ప్రక్రియ తదితర సమాచారం అందుబాటులో ఉంటుంది. మహిళలు, విద్యార్థుల్లో యోగాపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని సంజీవని ప్రాజెక్టుకు కూడా లింక్ చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్ సద్గురు జగ్గీ వాసుదేవ్, బ్రహ్మకుమారీస్, దాజీ, బాబా రామ్ దేవ్ లాంటి విశిష్ట వ్యక్తుల భాగస్వామ్యం తీసుకుంటున్నాం. ప్రకృతి ఆశ్రమం నిర్వహిస్తున్న మంతెన సత్యనారాయణ రాజు సేవలు కూడా వినియోగించుకుని యోగాను ఇంటిగ్రేట్ చేస్తాం. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఈ యోగా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ చేపడుతున్నాం. గత ఏడాది యోగాంధ్ర కార్యక్రమంతో దేశం, ప్రపంచం మొత్తం మన వైపు చూసేలా చేశాం. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో నిర్వహించిన యోగాంధ్రతో రికార్డులు సృష్టించాం. గతేడాది 2.44 కోట్ల మంది యోగాంధ్ర కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకున్నారు. 1.91 కోట్ల మందికి సర్టిఫికెట్లు అందించాం. 1.33 లక్షల వేదికలపై 1.53 లక్షల మంది ట్రైనర్లతో నిర్వహించాం. 2.18 కోట్ల మంది వెల్‌నెస్ సెంటర్లు, ఆయుష్ కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లోని తెలుగు వారు ఉపయోగించుకునేలా యోగాంధ్ర పోర్టల్ ఏర్పాటు చేస్తున్నాం. నాణ్యమైన జీవనానికి యోగా మనకు వారసత్వంగా అందిన ఓ అమూల్యమైన సంపద... దానిని అంతా అందిపుచ్చుకోవాలి. ఏపీలో చేస్తున్న ప్రకృతి సేద్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చింది... ఈ విజ్ఞానాన్ని మనం ప్రపంచానికి అందించేలా చర్యలు చేపడుతున్నాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**లిప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ఇప్పుడు సాధ్యం కాదులి**

"తెలంగాణలో పవన్ కళ్యాణ్ పై చేసిన వ్యాఖ్యలు సరికాదు. ఇలాంటివి మాట్లాడి లేనిపోని సమస్యలు సృష్టించకూడదు. విభజన జరిగి 12 ఏళ్లు అయ్యింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయాం. తెలంగాణలోని కొందరు నాయకులు ఇప్పుడు మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టలేరు. ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. తెలంగాణలోని కొందరు నాయకులు అనవసర అంశాలు మాట్లాడుతున్నారు. నేను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేశాను. తమిళనాడుకు కర్నాటకతో సహా వివిధ ప్రాంతాలకు చెందిన వారు... జాతీయ స్థాయి నేతలు వచ్చారు. కర్నాటక నుంచి డీకే శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ ఉంది. బీఆర్ఎస్ నేషనల్ పార్టీ అని ఆంధ్రప్రదేశ్ లో కూడా ఆ పార్టీ శాఖను పెట్టారు. విస్తరిస్తాం అన్నారు. మరి ఇప్పుడు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. ఇది కరెక్ట్ కాదు. అమెరికాలో, ఆస్ట్రేలియాలో, యూకేలో తెలుగువాళ్లు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో మన వాళ్లు పదవులు చేపడుతున్నారు. అక్కడ ఉండే రాజ్యాంగం ప్రకారం పని చేస్తున్నారు. ప్రజలకు ఎవరు మంచిగా సేవలందిస్తారో... వాళ్లు ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతున్నారు. అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. ప్రజలకు మంచి చేయటంలో పోటీ పడాలి తప్ప... ప్రజల మధ్య విబేధాలు తేవటం సరికాదు. రెండు ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరగాలి. అనసవరంగా వివాదాలు సృష్టించటం ఎవరికీ మంచిది కాదు."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**లిబాగు చేస్తుంటే బురద జల్లుతారు... ఇదీ గొడ్డలి పార్టీ నైజంలి**

"గొడ్డలి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలు బహిష్కరించాలి. అసత్యాన్ని పదేపదే చెబితే ప్రజలు విశ్వసిస్తారని కొందరు అనుకుంటున్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాల నియామకానికి టీడీపీ ఓ బ్రాండ్. ఎన్నికల్లో ప్రకటించి అధికారంలోకి రాగానే మొదటి సంతకం చేసి అత్యంత కట్టుదిట్టంగా నియామకాలు చేపట్టాం. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు అంటున్నారు. కానీ వారికి క్రీడల్లో ఏమేమి ఉన్నాయో కూడా తెలీకుండా మాట్లాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కేటగిరీల ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో నియామకాలు జరిగాయి. వాళ్ల పేటీఎం బ్యాచ్ ల ద్వారా లేని పోని దుష్ప్రచారం చేస్తున్నారు. కొందరు చేస్తున్న దద్దమ్మ పనులకు ప్రజలు ఇబ్బందులు పడాలా...? పారదర్శకంగా చేసిన నియామకాలపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారు. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీగా అధ్యయనం చేసి ఆ తర్వాతే మాట్లాడాలి. సాక్ష్యాలు, నిజాలతో అసెంబ్లీలో గట్టిగా పోరాడిన ఘటనలు ఉన్నాయి. కొందరు ఏదేదో మాట్లాడేసి బురద చల్లుతామంటే ఎవరు విశ్వసిస్తారు..? యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ కోసం రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. దీనిపైనా విమర్శలు చేయటం ఏమిటి..? ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. దీనికి ప్రజల్లో చైతన్యం తీసుకురావటం తప్ప మరోమార్గం లేదు."అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు

## కల్లూరులో ఎండీఎం-సీసీహెచ్‌లకు మండల స్థాయి శిక్షణ



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు మండల విద్యాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం"కు సంబంధించిన ఎండీఎం–సీసీహెచ్ (వంట నిర్వాహకులు, సహాయకులు)లకు ఒకరోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు ఎం. శ్రీనివాసులు (ఎంఈవో–1), జి. వనజ కుమారి (ఎంఈవో–2) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెనూను పాటిస్తూ, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వంట నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు పాల్గొన్నారు.

## నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా

## తిలకించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి బృందం.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ లతో పాటు సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి నార్వే పార్లమెంట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. పాలన, ప్రజా విధానాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై జరిగిన ఫలవంతమైన ఆలోచనల మార్పిడి విలువైన అవగాహనను అందించడమే కాకుండా, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసిందని, ఒకరినొకరు అనుభవాల గురించి నేర్చుకుంటూ, భవిష్యత్తులో మరింత బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు ఎదురుచూస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



మహానంది, పల్లె వెలుగు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని గోపవరం సొసైటీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పార్టీ బలో పేతానికి ప్రత్యేకశ్రద్దతో పనిచేయాలన్నారు. బూత్ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారిని పార్టీ తప్పక గుర్తిస్తుందని వారికే పదవులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ నాయక్,బూత్ కన్వీనర్లు షేక్ మాబు,ఇర్ఫాన్, శేఖర్,జమాల్,సుంకన్న, పాములేటి తదితరులు పాల్గొన్నారు.

## అర్జునాపురం క్రిష్టిపాడు గ్రామాలలో పొలం పాసుపుస్తకాలు పంపిణీ



దొర్నిపాడు జూన్ 3 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్ర ప్రభుత్వము రైతుల భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను మండలంలోని అర్జునాపురం, క్రిష్టిపాడు, గ్రామాల రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయా గ్రామాల వీఆర్వోలు సాంబశివుడు షమీమున్ తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు చెందిన భూములను రి సర్వే చేసి గతంలో ఇచ్చిన పాసుపుస్తకాల స్థానంలో కొత్త పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు, క్రిష్టిపాడు విఆర్వో సాంబశివుడు మాట్లాడుతూ భూమి సమస్యలున్న వాటిని మినహా గ్రామంలో672మందిరైతులకు సంబంధించిన పొలం పాసుపుస్తకాలగాను537పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు అదేవిధంగా అర్జునపురం వీఆర్వో షమీమున్ మాట్లాడుతూ 370 పాస్ పుస్తకాలుగానుఅన్నిటిని రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో తలారి శాంత కుమార్ రైతులు పాల్గొన్నారు

# కడపలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు "

## పోస్టర్ ఆవిష్కరణ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం.





పల్లె వెలుగు కడప. వైఎస్ఆర్ జిల్లా కడప నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం మరియు కడప నియోజకవర్గ సమన్వయకర్త అంజాద్ బాషా నివాస కార్యాలయంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్‌ను సీఈసీ సభ్యుడు ఎవరు కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి ఎస్ఈసి సభ్యులు మాసిమా బాబు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 'సూపర్ సిక్స్' పేరుతో ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని, మహిళలు, యువత, రైతులు, నిరుద్యోగులు ప్రభుత్వ విధానాలతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు అని విమర్శించారు.

రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యుత్ ఛార్జీలు, ఇంధన ధరలు పెరగడంతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడిందని పేర్కొన్నారు. ధరల పెరుగుదలతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుండగా, ప్రభుత్వం మాత్రం ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు ప్రస్తుతం అమలు చేస్తున్న పాలనకు ఎలాంటి పొంతన లేదని నాయకులు వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం, అభివృద్ధి పనుల్లో మందగమనం, ఉద్యోగ అవకాశాల కల్పనలో నిర్లక్ష్యం కారణంగా అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, మాజీ కార్పొరేటర్లు మాజీ కోఆప్షన్ సభ్యులు డివిజన్ ఇన్చార్జీలు జిల్లా మరియు నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు ముఖ్య నాయకులు, మహిళ నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో నాలుగు బర్రెల మృతి

## : బాధిత రైతును పరామర్శించిన గౌరు జనార్దన్ రెడ్డి



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌తో నాలుగు బర్రెలు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన రైతు తెలుగు మద్దిలేటి సాకుతున్న నాలుగు బర్రెలు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. విషయం తెలుసుకున్న పాణ్యం నియోజకవర్గ యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి బుధవారం (లేదా సంబంధిత వారం) సల్కాపురం గ్రామాన్ని సందర్శించారు. బాధిత రైతు మద్దిలేటిని పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. పెట్టుబడి పెట్టి సాదుకున్న పశువులు ఇలా అకాల మరణం చెందడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, ఆయన తన వ్యక్తిగత తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందిస్తాం: గౌరు జనార్దన్ రెడ్డి అనంతరం గౌరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ... నోరు లేని జీవాలు విద్యుత్ షాక్‌తో చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులతో పాటు, పశుసంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడి బాధిత రైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి కష్టం వచ్చినా తాము ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: ఈ పరామర్శ కార్యక్రమంలో కల్లూరు మండల అధ్యక్షుడు డి. రామాంజనేయులు, గ్రామ నాయకులు దేవేందర్ రెడ్డి, బతుకన్న, శేఖర్, మౌలాలి, నెర్వాడ జాఫర్, గోకులపాడు మహేష్ రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వెలుగోడులో వీధుల అధ్వాన్నం





బండి ఆత్మకూరు పల్లె వెలుగు మే 3 : వెలుగోడు పట్టణంలో వీధులు అధ్వాన్నం గా ఉన్నాయని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీధులు బురదమయంగా మారాయని, నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడుతూ ఉందని పేర్కొంటున్నారు. గ్రామంలోని సుంకులమ్మపేట సుంకులమ్మ గుడి సమీపంలో నీ ప్రజలు గత 12 సంవత్సరాలుగా రోడ్డు నిర్మించాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని అనేకమార్లు అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వీధి చుట్టుపక్కల ప్రాంతాలలో కాలువలు నిర్మించి రోడ్లు వేసినప్పటికీ మా వీధులను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండి ప్రజలు అదే బురద మురుగునీళ్లలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. సుంకులమ్మపేటలోని చెన్నకేశవ ఆలయం నుండి, సుంకులమ్మ ఆలయానికి వెళ్లే ప్రసన్న రహదారి అధ్వానంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. వెలుగోడులో అరుగుల వద్ద పరిస్థితి కూడా దారుణంగా ఉందన్నారు. పైపులైను మరమ్మత్తుల కోసం గుంతలు తవ్వి మట్టిని రోడ్డుపైనే వదిలేశారని దీనివల్ల మురుగునీరు రోడ్లపై నిలిచిపోయిందని అన్నారు. చిన్నపిల్లలు వృద్ధులు మహిళలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఈ కారణంగా డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని అంటున్నారు. పిల్లలకు అనారోగ్య సమస్యలు ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే దానికి బాధ్యత ఎవరిదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపించాలని ఈ ప్రాంత వాసులు జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి మండల స్థాయి శిక్షణ




హోళగుంద పల్లె వెలుగు జూన్ 03 హొళగుంద మండల విద్యాశాఖ అధికారి–2 పి. కబీర్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద మండల స్థాయి కుక్ కమ్ హెల్పర్స్ కోసం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సుధారాణి, కబీర్ సాబ్ , ట్రైనర్, కుక్ కమ్ హెల్పర్స్, కేజీబీవీ సీఆర్టీలు, సీఆర్ఎంటీలు, డీటీపీ, ఎంఐఎస్ సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహార ప్రమాణాలకు అనుగుణమైన భోజనం తయారు చేయడం, ఆహార నాణ్యతను కాపాడడం, వంటశాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు భోజనం వడ్డించే విధానం, అందరికీ సమానంగా ఆహారం అందించడం, భోజన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను ప్రాయోగికంగా వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో మధ్యాహ్న భోజన పథకం కీలక పాత్ర పోషిస్తోందని, కుక్ కమ్ హెల్పర్స్ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన సూచనలు, మార్గదర్శకాలను పాఠశాల స్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న సీసీహెచ్‌లు ఈ శిక్షణ ద్వారా విలువైన సమాచారం, సూచనలు పొందినట్లు తెలిపారు.

# జలధార – జలహారతితో పుసులూరు రైతులకు సాగునీటి భరోసా.

**రూ.4.10 లక్షలతో పెద్దవంచ కాలువ పూడికతీత పూర్తి.. 500 ఎకరాలకు ప్రయోజనం.**

**170 మంది శ్రామికుల శ్రమ ఫలితం.. దిగువ పొలాలకు సాఫీగా చేరుతున్న కేసీ కెనాల్ నీరు.**





పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల జిల్లా నంద్యాల మండలంలోని పుసులూరు గ్రామం ఒక మారుమూల వ్యవసాయ గ్రామం. మండల కేంద్రానికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి రవాణా సౌకర్యాలు పరిమితంగానే ఉన్నాయి. అయితే ఈ గ్రామ ప్రజల జీవనాధారం మాత్రం వ్యవసాయమే. ముఖ్యంగా వరి సాగుపై ఆధారపడిన రైతులు ప్రతి ఏడాది కేసీ కెనాల్ ద్వారా వచ్చే సాగునీటితో 250 నుంచి 350 ఎకరాల వరకు రెండు పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు.

పుసులూరు గ్రామంతో పాటు కానాల, మిట్నాల, పాండురంగాపురం గ్రామాల రైతులకు జీవనాడిగా నిలిచింది “పెద్దవంచ కాలువ”. కానాల వంచ నుంచి మిట్నాల వంచ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవున విస్తరించిన ఈ కాలువ ద్వారా దాదాపు 300 మంది రైతులకు చెందిన 400 నుంచి 500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. చివరికి ఈ నీరు మిట్నాలలోని శివరామస్వామి కుంటలో చేరి పరిసర ప్రాంతాలకు కూడా ఉపయోగపడుతుంది.

అయితే గత కొంతకాలంగా ఈ కాలువలో పూడిక పేరుకుపోవడం, మట్టి, గడ్డి మరియు కలుపు మొక్కలు అధికంగా పెరగడం వల్ల నీటి ప్రవాహం పూర్తిగా దెబ్బతింది. కేసీ కెనాల్ నుంచి విడుదలయ్యే నీరు కాలువ చివరి భాగాలకు చేరకపోవడంతో దిగువ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగునీరు సకాలంలో అందక పంటల దిగుబడులు తగ్గిపోవడం, సాగు వ్యయాలు పెరగడం వంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురి చేశాయి.

ఈ సమస్యను గుర్తించిన గ్రామ రైతులు, ఉపాధి హామీ పథకం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతుల అవసరాన్ని అర్థం చేసుకున్న అధికారులు వెంటనే స్పందించి జలధార – జలహారతి కార్యక్రమం కింద రూ.4.10 లక్షల వ్యయంతో కాలువ పూడికతీత పనులను మంజూరు చేశారు. గత 10 రోజులుగా గ్రామంలో 170 మంది ఉపాధి హామీ కూలీలు ప్రతిరోజూ శ్రమించి కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. కాలువ మొత్తం శుభ్రపరచడంతో నీటి ప్రవాహం తిరిగి పునరుద్ధరించబడింది. ప్రస్తుతం కేసీ కెనాల్ నుంచి వచ్చే నీరు ఎలాంటి ఆటంకం లేకుండా దిగువ ప్రాంత పొలాల వరకు చేరుతోంది.

ఈ సందర్భంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, “గతంలో నీరు మధ్యలోనే ఆగిపోవడంతో మా పొలాలకు సరైన సాగునీరు అందేది కాదు. ఇప్పుడు కాలువ శుభ్రం కావడంతో నీరు సాఫీగా వస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం” అని తెలిపారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, “జలధార – జలహారతి కార్యక్రమం కేవలం పూడికతీత పనులు మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవం పోసే కార్యక్రమం. సాగునీటి వనరులను పునరుద్ధరించడం ద్వారా రైతులకు స్థిరమైన వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నాం. ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం” అని పేర్కొన్నారు.

పుసులూరు గ్రామంలో చేపట్టిన ఈ పూడికతీత పనులు రైతుల ఆశలను చిగురింపజేశాయి. ఒకవైపు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించగా, మరోవైపు వందల ఎకరాలకు సాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరిచాయి. జలధార – జలహారతి కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ పురోగతికి ఎలా దోహదపడుతుందో పుసులూరు గ్రామం నేడు ఒక ఆదర్శంగా నిలుస్తోంది.

## ముచ్చుమరి-ఓరవకల్ నీటి పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

**క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్ వరకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నీటి పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండల పరిధిలో ముచ్చుమరి నుంచి ఓరవకల్ వరకు కొనసాగుతున్న నీటి పైప్‌లైన్ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, పైప్‌లైన్ ఏర్పాటు, నిర్మాణ నాణ్యత, సాంకేతిక అంశాలు, ఎదురవుతున్న సమస్యలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దశను పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరా మరియు పారిశ్రామిక అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొంటూ, పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నందికొట్కూరులో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటి పూర్తి కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు భద్రతా నిబంధనలను కూడా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సంబంధిత ప్రాంతాలకు నీటి సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఆత్మకూర్ ఆర్డీఓ వెంకట శివ, నందికొట్కూరు తహశీల్దార్ శ్రీనివాసులు తదితరులు కలెక్టర్ వెంట ఉండి పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల వద్ద ప్లెక్సీల నిషేధం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 3 : మద్యం దుకాణాల వద్ద ప్లెక్సీల ప్రదర్శనతో పాటు, బార్ల వద్ద ప్రకటనల బోర్డులు హోర్డింగులు నిషేధమని ఎక్సైజ్ ఎస్సై శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బండి ఆత్మకూరు లోని మద్యం దుకాణాన్ని ఎస్సై తనిఖీ చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు బార్ల వద్ద ఉన్న ప్రచార సామాగ్రిని తొలగించాలన్న ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు తనిఖీలను నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా బోర్డులు, ప్రచార సామాగ్రిని ప్రదర్శించే యాజమాన్యాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శివప్రసాద్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలను తొలగించారు. మద్యం దుకాణం ప్రాంతంలో ఉన్న వివిధ బ్రాండ్ల ప్రకటనకు సంబంధించిన బోర్డులకు స్టిక్కర్లు అంటించారు. ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు.

# నంద్యాల ప్రజల గుండెల్లోంచి

## శిల్పా కుటుంబాన్ని ఎవరూ చెరిపేయలేరు.. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.

**అధికారం ఉంది కదా అని సేవా కార్యక్రమాలను అడ్డుకుంటారా?**

**మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది.. ప్రజల దీవెనలు మాకున్నాయి.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల ప్రజల గుండెల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవరూ చెరిపేయలేరు..! అధికారం ఉంది కదా అని అడ్డుకుంటే.. సేవ ఆగిపోదు..! నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు ఇప్పుడు స్థానికంగా సంచలనంగా మారాయి. “మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది.. ప్రజల దీవెనలు మాకున్నాయి” అంటూ ఆయన ప్రత్యర్థులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. రాజకీయాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. అధికారాలు మారుతుంటాయి. కానీ, పేదవాడి ఆకలి, పేదింటి మహిళ కష్టం ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. నంద్యాల నడిబొడ్డున గత 16 ఏళు గా నిరంతరంగా సాగుతున్న శిల్పా సేవాసమితి ప్రస్థానంలో ఇప్పుడు రాజకీయ అడ్డంకులు కలకలం రేపుతున్నాయి. శిల్పా మహిళా సహకార బ్యాంక్ ద్వారా అర్హులైన 141 మంది పేద మహిళలకు.. దాదాపు 24 లక్షల 58 వేల రూపాయల రుణాల చెక్కులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు నంద్యాల ప్రజల మనసులను తాకుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ “నంద్యాల ప్రజల మనసుల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవ్వరూ చెరిపేయలేరు. మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది. అధికారం ఉంది కదా అని మేము చేస్తున్న సేవా కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలతో మేము ముందుకు వెళ్తాం అన్నారు. కక్ష సాధింపు చర్యలా? లేక కావాలనే అడ్డుకుంటున్నారా? టెక్కె మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌లో గత 16 ఏళ్లుగా శిల్పా సహకార్, శిల్పా మహిళా సహకార్ బ్యాంక్, నంది రైతు పెస్టిసైడ్స్ నడుస్తూ.. పేదలకు, రైతులకు అండగా నిలుస్తున్నాయి. 1987లో కట్టిన ఆ బిల్డింగులు, దాదాపు 23 ఏళ్ల పాటు శిథిలావస్థలో ఉంటే.. వాటిని సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి, క్రమం తప్పకుండా అద్దెలు కడుతూ సేవ చేస్తుంటే.. ఇప్పుడు వాటిని ఖాళీ చేయించేందుకు, ఈనెల 9న బహిరంగ వేలం వేసేందుకు నోటీసులు ఇవ్వడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా.. పేదలకు చేసే సేవలను ఆపే ప్రసక్తే లేదని శిల్పా రవిరెడ్డి స్పష్టం చేశారు. రుణాలు అందుకున్న మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్లు హరిలీల, లక్ష్మీనారాయణ ,మహిళలు పాల్గొన్నారు. అధికార బలం ముందు.. పేదల ఆశీస్సుల బలం గెలుస్తుందా? శిల్పా కుటుంబం నంద్యాల ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానాన్ని ప్రత్యర్థులు చెరపగలరా? కాలమే సమాధానం చెప్పాలి..

# ఐడియా జనరేషన్ & వాలిడేషన్ వర్క్‌షాప్ విజయవంతం..



పాణ్యం జూన్ 03 పల్లె వెలుగు : మండలం పరిధిలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ డేటా సైన్స్ ఆధ్వర్యంలో ఐడియా జనరేషన్ & వాలిడేషన్ వర్క్‌షాప్ ఆన్‌సైట్ కోచింగ్ కార్యక్రమం బుధవారం డీఎస్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ సి.చంద్ర మౌళి హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థులు తమ ఆలోచనలను వినూత్న ఆవిష్కరణలుగా ఎలా మలచుకోవాలో, సమస్యలను గుర్తించి వాటికి సృజనాత్మక పరిష్కారాలను ఎలా అభివృద్ధి చేయాలో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్జీఎం కాలేజీ నుండి ఎంపికైన 14 విద్యార్థి బృందాలకు ప్రత్యేక మెంటరింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి బృందం తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించగా, డాక్టర్ చంద్ర మౌళి వాటి సాధ్యత, మార్కెట్ అవసరాలు, వ్యాపార అవకాశాలు, అభివృద్ధి దిశలపై విలువైన సూచనలు వారికి అందించారు. రాబోయే రోజుల్లో ఈ బృందాలకు నిరంతర మార్గదర్శకత్వం అందించి స్టార్టప్‌లుగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తామని తెలిపారు. అలాగే స్టార్టప్‌ల స్థాపన, ఐడియా వాలిడేషన్, బిజినెస్ మోడల్ రూపకల్పన, ఇంక్యుబేషన్ అవకాశాలు ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## నాలుగు గ్రామాలలో జనగణన తక్కువ శాతం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 3 : 2011 జనగణనతో పోల్చుకుంటే ప్రస్తుతం జన గణనకు సంబంధించి నాలుగు గ్రామాలలో తక్కువ శాతం నమోదు ఉందని తాసిల్దార్ పద్మావతమ్మ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం తాసిల్దార్ కార్యాలయంలో నారాయణపురం, బండి ఆత్మకూరు,లింగాపురం, గాలి చెన్నయ్యపాలెం,సంత జుటూరు గ్రామాలకు సంబంధించిన ఎన్యుమరేటర్లతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ విషయంపై ఎన్యుమరేటర్లు జనగణన విషయంలో పునః పరిశీలించాలని సూచించారు. 2011 జనాభాతో పోల్చుకుంటే జిసిపాలెం సంత జుటూరు నారాయణపురం గ్రామాలలో తక్కువ శాతం నమోదు ఉందని సూపర్వైజర్ల విషయంపై దృష్టి సారించి పరిశీలించాలన్నారు. గ్రామాలలో రేషన్ కార్డు ఆధార్ తో పాటు నివాసం ఉండి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి సమాచారాన్ని సేకరించి పూర్తిస్థాయిలో జనగణను నిర్వహించాలని అన్నారు. జనగణన నమోదు చేసుకొని నారాయణపురం బండి ఆత్మకూరు సంత జుటూరు జిసి పాలెం గ్రామాల ప్రజలు సూపర్వైజర్లు, ఎన్యుమారేటర్లకు సహకరించి వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, డిప్యూటీ ఎంపీడీవోలు అన్నం పురుషోత్తం, చంద్రమౌళి మండల సర్వేయర్ నాగప్రసాద్ గ్రామ సచివాలయ సిబ్బంది తో పాటు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మినీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

-గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి










ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 3 కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎన్నిక జరిగింది ఈ అసోసియేషన్ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే బీవీ జయ జయ నాగేశ్వర్ రెడ్డి, ని మినీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఎన్నుకున్నారు అధ్యక్షులు బందే నవాజ్, ప్రెసిడెంట్ ఎండి యూసుఫ్, సెక్రెటరీ ఎం సత్తర్ భాష, వైస్ ప్రెసిడెంట్ శివ, ట్రెజరరి మహమ్మద్, జెయింట్ సెక్రెటరీ రాఘవేంద్ర అసోసియేషన్ ఓనర్స్ లారీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు సకాలంలో, నాణ్యమైన సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ ప్రజల అభిప్రాయాలు (పర్సెప్షన్), రీ-సర్వే ప్రక్రియ పురోగతి, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ స్థితి వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరు వివరాలతో పాటు సంబంధిత శాఖల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సేవలను సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నాణ్యతతో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మున్సిపల్ సేవలు ప్రైవేటీకరిస్తే ప్రజా ఆందోళన లు తప్పదు :సిపిఎం.

**మునిసిపల్ ప్రైవేటికరణ జిఓలు 975, 673 రద్దు చేయాలి:-సిపిఎం.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మున్సిపల్ సేవలను ప్రైవేటీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓలు 673, 975ను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి దర్శనం. లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా. నరసింహ, కి. మహమ్మద్ గౌస్, పి. వెంకట లింగం, పట్టణ కమిటీ సభ్యులు మాబుజైలాన్ లు కలిసి ప్రెస్ నోట్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ 673,975 జిఓ ల ద్వారా 14 సేవలను ప్రైవేటుపరం చేస్తున్నారని, వాహనాలు, డ్రైనేజీ, మంచినీరు, ఆఫీస్ నిర్వహణ సహా పిపిపి పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ ఎన్నికలు జరగలేదని, ప్రస్తుతం పాలకవర్గాలు లేవని, అధికారుల పర్యవేక్షణలోనే పాలన సాగుతోందని గుర్తుచేశారు. పిపిపి అమలైతే భవిష్యత్తులో ఎన్నికలు జరిగి ఛైర్పర్సన్లు వచ్చినా ఏమి చేయలేరని చెప్పారు. పౌర సేవలు అందించడానికే ఉన్న పంచాయతీలు,మున్సిపాలిటీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫైనాన్స్ కమిషన్ ద్వారా 40 శాతం నిధులు విడుదల చేస్తే ఏ సేవనూ ప్రైవేటీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మునిసిపల్ సేవలను ప్రైవేటీకరించి యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం వేసిన చెత్త పన్ను ప్రజలకు భారంగా మారిందని, ఇది రాజకీయ అంశంగా మారడంతో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు 14 సేవలను ప్రైవేటుపరం చేసి యూజర్ ఛార్జీలు వేస్తే పట్టణ ప్రజలపై వేల కోట్ల భారం పడుతుందని, ప్రజలు ఎలా భరిస్తారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వల్ల మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీలు యంత్రాలతో కొద్దిమందితో పనిచేయించుకుంటారని, దీంతో ఉద్యోగాలు ఊడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిఓలు 975,673 ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ యూనియన్లు, ప్రజలు, పౌర సంఘాలను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పెద్దదేవలాపురం, నారాయణపురం గ్రామాలలో దేవాలయ భూములు వేలం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 3: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పెద్దదేవలాపురం నారాయణపురం గ్రామాలలోని దేవాలయ భూములను బుధవారం కౌలు నిమిత్తమై వేలం పాటలను నిర్వహించారు. పెద్దదేవళాపురం గ్రామంలోని శ్రీ వరదరాజ ఆంజనేయ లింగమయ్య స్వామి దేవస్థానంలో సంబంధించి 40. 36 ఎకరాల భూమికి వీణ పాటలను నిర్వహించారు. గత సంవత్సరం 12 లక్షల 8 3 వేల 500 రూపాయల ఆదాయం రాగా, ఈ సంవత్సరం 12 లక్షల 94,500 కు వేలంపాట జరిగిందని, మొత్తం మీద 11,000 రూపాయల ఆదాయం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. నారాయణపురం గ్రామంలోని ఆంజనేయ నారాయణ స్వామి దేవస్థానం లకు సంబంధించి 18 పాయింట్ 82 ఎకరాల భూమికి వేలం పాటలను నిర్వహించారు. ప్రస్తుత సంవత్సరం ఆరు లక్షల 57,600 రూపాయలు రాగా, గత సంవత్సరం నిర్వహించిన వేలం పాటాల్లో ఐదు లక్షల 9600 వచ్చిందని, మొత్తం మీద ఒక లక్ష 48 వేల రూపాయల ఆదాయం వచ్చింది. వేలంపాట కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి బి హరిచంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్, పెద్దదేవలాపురం దేవస్థానం చైర్మన్ చైర్మన్ జయదేవ దత్త ధర్మకర్తల మండలి సభ్యులు కృష్ణారెడ్డి, ప్రసాదు,డిష్ రామలింగం పాల్గొన్నారు. నారాయణపురం గ్రామంలో నిర్వహించిన వేలం పాటల్లో చైర్మన్ కే వెంకట రమణ ధర్మకర్తల మండలి సభ్యులు అర్చకులు పివి శేషయ్య గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు. రెండు గ్రామాలలో నిర్వహించిన వేలం పాటలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఐ మహబూబ్ భాష, పోలీసు సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

# పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దుకాణాలు సీజ్

☛నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు




పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలోని వాణిజ్య దుకాణాల యజమానులు తమ దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి దుకాణంలో తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచితే జరిమానాలు విధించడమే కాకుండా ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి, అవసరమైతే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. బుధవారం నగర పరిధిలోని 44వ జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లు, సుంకేసుల రోడ్డులో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. జాతీయ రహదారి వెంట పరిశుభ్రతను మెరుగుపరచేందుకు ప్రత్యేక వాహనం, సిబ్బందిని నియమించాలని సిబ్బందిని ఆదేశించారు. సంతోష్ నగర్, బళ్ళారి చౌరస్తా వద్ద ఉన్న టీ దుకాణాల వద్ద డస్ట్‌బిన్ లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, ద్విచక్ర వాహనాలు అస్తవ్యస్తంగా పార్క్ చేయడాన్ని గమనించిన కమిషనర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జరిమానా విధించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. మరోసారి ఇదే పరిస్థితి పునరావృతమైతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాన్ని సీజ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, కుర్మయ్య, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవాలి.

☛ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు.

☛ పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి.







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ( ఏ పి పి సి బి) మరియు అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను ఆవిష్కరించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు, పర్యావరణ హిత జీవన విధానాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)లో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొననున్న నేపథ్యంలో, వారందరికీ జూట్ బ్యాగులు మరియు మొక్కలను పంపిణీ చేసేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రజలను మరింతగా భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్య సమస్యలు మరియు సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మరియు అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జూన్ 20వ తేదీలోపు జిల్లాలో 8 లక్షల విత్తన బంతులు ( సీడ్ బాల్స్) తయారు చేసి సిద్ధంగా ఉంచేలా సోషల్ ఫారెస్ట్రీ డివిజనల్ ఫారెస్ట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు మరియు ఖాళీ భూముల్లో విస్తృతంగా చల్లడం ద్వారా హరిత విస్తీర్ణాన్ని పెంచే చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

# వ్యర్థాల నిర్వహణ.. యాజమాన్యాలదే బాధ్యత

**- చెత్త ఎక్కువగా ఉత్పత్తి చేసే సంస్థలు స్థానికంగానే కంపోస్టు తయారీ చేయాలి**

● పర్యావరణ హితంగా వ్యర్థాల ప్రాసెసింగ్ దిశగా కీలక ముందడుగు

● నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు





పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 'ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026' ప్రకారం నగరంలో అధిక మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసే బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు తదితర సంస్థలు ఇకపై తమ వద్దే వ్యర్థాలను ప్రాసెస్ చేసి కంపోస్టుగా మార్చుకోవాల్సి ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నగర పరిధిలో అధికంగా చెత్తను ఉత్పత్తి చేసే పెద్ద హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థల ప్రతినిధులకు 'ఎక్స్‌టెండెడ్ బల్క్ వేస్ట్ జనరేటర్ రెస్పాన్సిబిలిటీ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణ--2026 నిబంధనల అమలులో భాగంగా నగరంలో రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. వ్యర్థాల నిర్వహణలో పెద్ద మొత్తంలో చెత్తను ఉత్పత్తి చేసే సంస్థల యాజమాన్యాలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇది పర్యావరణ హితంగా వ్యర్థాల ప్రాసెసింగ్ దిశగా కీలక ముందడుగని పేర్కొన్నారు. 20 వేల చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన వ్యాపార సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు, రోజుకు 40 వేల లీటర్లకు పైగా నీటిని వినియోగించే సంస్థలు, అలాగే రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. పెద్ద హోటళ్లు, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు తదితర సంస్థలు తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సొంతంగా ప్రాసెస్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌లో మిగిలిపోయే ఆహార పదార్థాలను మురుగునీటి కాలువల్లో కలపకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేందుకు ప్రత్యేక కంపోస్టింగ్ యూనిట్లు, డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శానిటరీ, హానికర వ్యర్థాలను నగరపాలక సంస్థ అధికారులకు అప్పగించవచ్చని, తడి, పొడి వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చాలని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహిస్తూ రోజువారీ వివరాలను నమోదు చేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జూన్ 30లోపు వార్షిక నివేదికను సంబంధిత ప్రభుత్వ శాఖలకు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, ఏఈ వైష్ణవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టండి..

**- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి**

☛ బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్ర మ్యాపింగ్ నిర్వహించాలి

☛ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో బీఎల్‌వోలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, అనర్హులైన వారి వివరాలను గుర్తించి జాబితాను నవీకరించనున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ 2002 జనవరి 1 నాటికి ఉన్న జాబితాను ప్రాతిపదికగా తీసుకొని ప్రస్తుత ఓటర్ల జాబితా పరిశీలిస్తారని పేర్కొన్నారు. జూన్ 5 నుంచి ఎస్ఐఆర్ ప్రారంభం కానుందని, జూన్ 15 నుంచి జులై 14 వరకూ బూత్ స్థాయి అధికారులు (బీఎల్వో) ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి సమగ్ర మ్యాపింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఫారాల పూరణ విధానం, అవసరమైన పత్రాల గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్లు రెండు హాఫ్ సైజ్ కలర్ ఫోటోలు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. బీఎల్‌వోలు అందజేసే రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకదాన్ని సమర్పించి, సంతకం చేసిన మరో కాపీని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, అర్హత కలిగిన ఒక్క ఓటరును కూడా జాబితా నుంచి తొలగించబోరని స్పష్టం చేశారు. ఎన్నికల సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, ఎన్నికల సిబ్బంది, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 3 పల్లె వెలుగు సీఎం సహాయక నిధి కింద మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం అని టీడీపీ సీనియర్ నాయకులు భార్గవ్ రామ్ తెలిపారు. ఆళ్లగడ్డ తాలూకాకు సంబంధించిన బాధితులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, సీనియర్ నాయకులు భార్గవ్ రామ్, సీఎం నారా చంద్రబాబు నాయుడు లకు కృతజ్ఞతలు తెలియజేశారు

# ప్రతి రైతుకు 1ఎకరాకు 50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి

**నీటిపారుదల శాఖ మంత్రికి వినతి**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 3 గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె ప్రాజెక్ట్ ద్వారా నష్టపోతున్న ఐరన్ బండ-ా, ఎన్నెగండ్ల,గోనెగండ్ల, గంజల్ల,బెల్లం దొడ్డి, గ్రామాల రైతుల వ్యవసాయ భూమిని ప్రాజెక్ట్ ప్రారంభం నుండి 100 ఎకరాల పంటలు ముప్పుకు గురై రైతులు నష్టపోవడం జరుగుతుందని ప్రస్తుతం ప్రాజెక్టును 1వీజ పెంచిన తర్వాత 300 ఎకరాలు ముప్పుకు గురయ్యే ప్రమాదం ఉందని, రైతులు నష్టపోకుండా 2013 భూ సేకరణ చట్ట ప్రకారంగా ప్రతి రైతుకు 1ఎకరాకు 50 లక్షల నష్టపరిహారాన్ని ఇవ్వాలనిలి పశ్చిమ ప్రాంతం జీవనాడి అయిన ఆర్ డి ఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ జాతీయ కార్యదర్శి. రామకృష్ణ నేతృత్వంలో ఐరన్ బండ, ఎన్నెగండ్ల,గోనెగండ్ల బాధితులతో నీటిపారుదల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు కి వింత పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో రంగన్న సిపిఐ నాయకులు పాల్గొన్నారు

## గూడూరు మున్సిపల్ కమిషనర్ గా సోమశేఖర్ యాదవ్



(గూడూరు, పల్లె వెలుగు జూన్ 03, బుధవారం) : గూడూరు పురపాలక సంఘ కమిషనర్ గా సోమశేఖర్ యాదవ్ (ఎఫ్ఏసి) బుధవారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు మున్సిపాలిటీ కమిషనర్ గా పనిచేస్తున్న అన్నవరం వెంకటేశ్వర్లు పదవీ విరమణ చేశారు. మున్సిపాలిటీలో మేనేజర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న సోమశేఖర్ యాదవ్ కు ఎఫ్ఏసీ కమిషనర్ గా మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా కమిషనర్ సోమశేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయం చుట్టూ పడి కాపులు కాయకుండా ఉండేందుకు సత్వరంగా పరిష్కరించేలా తనకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. అన్ని శాఖల సిబ్బంది సహకారంతో బాధ్యతలను ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తానని తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవం





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో రెండు రోజులపాటు నిర్వహించిన పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు పూజలు, మ్రొక్కులు తీర్చుకున్నారు. భక్తులు బంధుమిత్రులతో గ్రామం కిటికీటలాడింది. గ్రామానికి వెలుపలకు అమ్మవారిని చెక్క బంగారు రథంపై అశేష భక్తజనం వెంటరాగా తరలి వెళ్లింది. మధ్యాహ్నం తిరుగు ప్రయాణ సమయంలో నంద్యాల నుంచి మహానందికి రాకపోకలు సాగించే రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మహానంది ఎస్ ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి,పోలీసులు శ్రమించి రాకపోకలను సాఫీగా సాగేలా కృషిచేశారు. ఈ దేవర ఉత్సవాల్లో నంద్యాల కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవి, భువనేశ్వర్ రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి, మహానంది ఎస్సై ఎన్. రామ్మోహన్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు..

# బి ఈ కేఫ్ ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి





ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 3 పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణంలోని కడప రోడ్ హెచ్పి పెట్రోల్ బంక్ ఆవరణములో నూతనంగా ఏర్పాటు చేసిన బిఈ కేఫ్ ను మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి బుధవారం నాడు ప్రారంభించారు. అనంతరంఅక్కడ ఏర్పాటు చేసిన బి ఈ కేఫ్ లో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా బి ఈ కేఫ్ ను ఏర్పాటు చేయడం మాజీ కౌన్సిలర్ వైకాపా సీనియర్ నాయకులు గో ట్లూరు సుధాకర్ రెడ్డిని అభినందించారు. నేషనల్ స్థాయిలో బి ఈ కేఫ్ ప్రముఖంగా జాతీయ రహదారులపై ఏర్పాటు చేస్తుంటారని రహదారిపై వెళ్తున్న ప్రయాణికులకు కాసింత ఊరట కోసం కేపులు ఉంటాయని అలాంటిది ఆళ్లగడ్డ పట్టణంలోని హెచ్పి పెట్రోల్ బంకు ఆవరణంలో నూతనంగా ఇలాంటివి ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖులందరూ కార్యక్రమానికి హాజరై సుధాకర్ రెడ్డి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ న్యాయవాది సూర్యనారాయణ రెడ్డి,గంగుల రామిరెడ్డి, రాజారెడ్డి, టి వినోద్ కుమార్, డాక్టర్లు, వైకాపా నాయకులు మిత్రులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు,

## సీఎం చంద్రబాబుతో ఓఎన్‌జీసీ చైర్మన్ మర్యాదపూర్వక భేటీ

### రాష్ట్రంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాలపై ఇరువురి మధ్య చర్చ



అమరావతి, జూన్ 03: ఓఎన్‌జీసీ చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయానికి వచ్చిన ఆయన రాష్ట్రంలో ఓఎన్‌జీసీ చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా- గోదావరి డెల్టా బేసిన్‌లో సహజవాయువు, చమురు అన్వేషణ, వెలికితీత పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో ఇంధన రంగం అభివృద్ధికి ఓఎన్‌జీసీ చేస్తున్న కృషిని, తదుపరి విస్తరణ ప్రణాళికల గురించి అరుణ్ కుమార్ సింగ్ సీఎంకు వివరించారు. ఓఎన్‌జీసీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి సమకూరే ఆదాయం, ఉపాధి అవకాశాలు స్థానిక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావంపై సీఎం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఓఎన్‌జీసీ మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని, తద్వారా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఇంధన భద్రతను పెంపొందించడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతగా ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులను ఆయా గ్రామాల్లో ఖర్చు పెట్టాలని సీఎం సూచించారు. చమురు సహజవాయువు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఓఎన్‌జీసీ చైర్మన్ కాకినాడ, గుంటూరులో కేన్సర్ చికిత్సల్లో వినియోగించే అధునాతన యంత్రాలను ఆస్పత్రులకు సమకూరుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఓఎన్‌జీసీ అధికారుల బృందం హాజరయ్యారు

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్‌ను ఆవిష్కరించిన

☛ఎర్రకోట రాజీవ్ రెడ్డి, ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 3 ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక చెన్నకేశవ రెడ్డి స్వగృహంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి “చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు” పోస్టర్‌ను ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4 నుండి 12 వరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను ఎమ్మిగనూరు నియోజకవర్గంలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, మేనిఫెస్టోలో పేర్కొన్న అనేక వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసానికి విరుద్ధంగా వ్యవహరించిన పాలనకు వ్యతిరేకంగా ప్రతి కార్యకర్త ప్రజల మధ్యకు వెళ్లి వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. జూన్ 4 నుండి 12 వరకు జరగనున్న నిరసన కార్యక్రమాల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జూన్ 4: మండల కేంద్రాల్లో టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, చంద్రబాబు నాయుడు -- పవన్ కళ్యాణ్ సంతకాలతో విడుదలైన హామీ పత్రాలు, సంబంధిత పత్రికా ప్రకటనల ప్రతులను దహనం చేసే కార్యక్రమం. జూన్ 8 & 9: నియోజకవర్గ కేంద్రాల్లో “వెన్నుపోటుకు రెండేళ్లు” పేరుతో టౌన్ హాల్ సదస్సులు నిర్వహించడం. జూన్ 12: చంద్రబాబు రెండేళ్ల పాలనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరించి, ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని రాజీవ్ రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 4 నుండి 12 వరకు జరగనున్న ప్రతి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బసిరెడ్డి, సునీల్ ,బుట్టా రంగయ్య, బందే నవాజ్ , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాముల ప్రభుత్వం అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదం

☛**వైసీపీ పాలన తీరుపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధ్వజం**

☛**బుచ్చిరెడ్డిపాళెంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన**

☛**'ఐ లవ్ బుచ్చిరెడ్డిపాళెం' లైటింగ్ సిస్టం ఆవిష్కరణ**



పల్లె వెలుగు (బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 03, బుధవారం) : బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ స్పెషల్ గ్రాంట్ రూ.2 కోట్లతో మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నుడా చైర్మన్ శ్రీ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే, బైపాస్ రోడ్డు నుంచి శేషాద్రి నగర్ రోడ్డు వరకు రూ.50 లక్షల నుడా నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ సెంటర్ వద్ద మున్సిపాలిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ బుచ్చిరెడ్డిపాళెం' ఎల్ఈడీ లైటింగ్ సిస్టమ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ విజయాలను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

**9 నెలల్లోనే మెగా డీఎస్సీ నిరుద్యోగులకు ఉద్యోగాలు**

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో నిరుద్యోగులకు 'డీఎస్సీ' అంటే ఏంటో తెలియకుండా చేశారని, జాబ్ క్యాలెండర్ల పేరుతో మోసం చేస్తూ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే డీఎస్సీ ప్రకటించి, రాష్ట్రంలో 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. నేడు ఏ మొహం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలు డీఎస్సీపై మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. కోవూరు నియోజకవర్గంలో రికార్డు స్థాయి అభివృద్ధికోవూరు నియోజకవర్గంలో ప్రతిపక్షాలు 'వెన్నుపోటు' కార్యక్రమాలు చేసే ముందు ఇక్కడ జరిగిన అభివృద్ధిని కళ్లారా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్నో ఏళ్లుగా దుస్థితిలో ఉన్న రోడ్లకు నేడు రూ.2 కోట్లు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. మలిదేవి కాలువ, ముదివర్తి కాజ్‌వే, మైపాడు-నెల్లూరు రోడ్డు పనులతో పాటు పీఫోర్ విధానంలో బుచ్చిరెడ్డిపాళెం మార్కెట్‌ను అద్భుతంగా నిర్మించుకున్నామని తెలిపారు. పిఫోర్ పథకం ద్వారా ఎంతో మంది 'బంగారు కుటుంబాలను' దత్తత తీసుకుని లబ్ధి చేకూర్చామని, ఆ వివరాలను వెళ్లి పరిశీలించవచ్చన్నారు.

**సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు అండ**

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూపర్ సిక్స్' పథకాలు రాష్ట్రంలో సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే కొనియాడారు. స్త్రీ శక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల వారికి ఛార్జీలు మిగిలి, కుటుంబాలకు పెద్ద ఆసరాగా నిలుస్తోందన్నారు. ఉచిత సిలిండర్లు ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నామని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు గత ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద ల్యాండ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని చెప్పిన విధంగానే రద్దు చేశామన్నారు. రైతుల పాస్ బుక్కులపై గత పాలకుల ఫోటోలు తీసేసి, అధికారిక 'రాజముద్ర'తో 'మీ భూమి -- మీ హక్కు' గ్యారంటీతో కొత్త పట్టాదారు పాస్ బుక్కులను అందజేశామని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగా రైతులకు రూ.20 వేలు అందించి అన్నదాతలను ఆదుకున్నామన్నారు. గతంలో కాలువలు తవ్వక, రైతు సంఘాలు లేక వ్యవసాయం దెబ్బతింటే, నేడు కాలువలన్నీ కళకళలాడుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మి 6 నెలలైనా డబ్బులు రాక రైతులు అల్లాడిపోగా, నేడు చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం కేవలం 24 గంటల్లోనే కూలీల నగదుతో సహా మొత్తం సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని స్పష్టం చేశారు. కొత్త పింఛన్లు రాబోయే జూన్ 12 నుంచి కొత్త పింఛన్లను పంపిణీ చేయబోతున్నామని వెల్లడించారు.


**గృహనిర్మాణ భారీ స్కామ్ బయటపెడతాం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గృహనిర్మాణాల పేరుతో అంతులేని అవినీతి జరిగిందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఇళ్ల ప్లాట్ల కోసం భూసేకరణలో ఎకరా రూ.10 లక్షల విలువైన భూమిని రూ.30 లక్షలకు కొనుగోలు చేసి భారీ స్కామ్‌కు పాల్పడ్డారని, దానికి తోడు లెవలింగ్ పేరుతో మరో రూ.10 లక్షలు దోచుకున్నారని మండిపడ్డారు. నెల్లూరులో పెద్ద భవనాలు ఉన్నవారికి కూడా ఇళ్లు మంజూరు చేశారని, ఇళ్ల నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్ల వద్ద కూడా డబ్బులు వసూలు చేశారని చెప్పారు. పేదల డబ్బులు నొకేసి కాంట్రాక్టర్లు ఇళ్లు కట్టకుండా వెళ్లిపోయారని, తీరా ఇప్పుడు చూస్తే ఆన్‌లైన్‌లో మాత్రం పేదల పేరిట ఇళ్లు పూర్తయినట్లు చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి స్కామ్‌లు చేసినందుకా వైసీపి నేతలు 'వెన్నుపోటు దినాలు' జరుపుకునేది అని ప్రశ్నించారు. కనీస పరిజ్ఞానం ఉన్న ప్రజలెవరూ ఇలాంటి వారిని నమ్మరని హితవు పలికారు.

**24 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు**

డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఇంటికో వ్యాపారవేత్తగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనలో, యువనేత, రాష్ట్ర ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చొరవతో ప్రభుత్వం వచ్చిన 24 నెలల్లోనే (రెండేళ్లలోనే) రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చామని, తద్వారా 6 లక్షల ఉద్యోగాలను కల్పించామని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమీషన్ చిన్నిబాబు, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎదురెదురుగా లారీలు ఢీకొని డ్రైవర్ మృతి



పల్లె వెలుగు ప్రతినిధి (తిరుపతి, జూన్ 03, బుధవారం) : తిరుపతి జిల్లా మామండూరు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మాధవన్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. కడప నుండి వస్తున్న సిమెంట్ కాంక్రిట్ లారీ చెన్నై నుండి వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, కడప నుండి సిమెంట్ కాంక్రీట్ తో వస్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అయితే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. సమాచారం అందుకున్న రేణిగుంట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

# ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి

**తహసీల్దార్ ఎస్. రామయ్య**



పల్లె వెలుగు (చిట్టమూరు, జూన్ 03, బుధవారం) : ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జూన్ 5వ తేదీ శుక్రవారం గుణపాడు జడ్పీ స్కూల్లో నిర్వహించనున్నట్లు చిట్టమూరు తహసీల్దార్ ఎస్. రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సూళ్లూరుపేట ఆర్డీవోతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రజల నుంచి భూ సమస్యలు, సర్వే సంబంధిత సమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. మండల ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

# గూడూరులో 4వ క్లస్టర్ 15వ యూనిట్ సమావేశం

**-లక్ష లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి తీర్మానం**



పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 3, బుధవారం) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేతల ఆదేశాల మేరకు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ సూచనలతో బుధవారం గూడూరు 2వ పట్టణంలో 4వ క్లస్టర్, 15వ యూనిట్ సమావేశం ఆ యూనిట్ ఇంచార్జ్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గూడూరు నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి ప్రసన్న, 4వ క్లస్టర్ ఇంచార్జ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచురామయ్య హాజరయ్యారు. ఈ సమావేశంలో గూడూరు 2వ పట్టణం వీరారెడ్డి పల్లి ప్రాంతంలోని 27, 28, 29 వార్డులలో మంచినీటి కొరత తీవ్రంగా ఉన్నందున లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మించాలని యూనిట్ ఇంచార్జ్ ప్రతిపాదించారు. మూడు వార్డులకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, బూత్ కో కన్వీనర్లు ఏకగ్రీవంగా ఆ తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో 27, 28, 29 వార్డుల అధ్యక్ష, కార్యదర్సులు, 9, 10, 11, 13, 20 వార్డుల బూత్ కన్వీనర్లు, బూత్ కో కన్వీనర్లు, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రిలే శిబిరంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**భారీ కేక్ కటింగ్, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ**



పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 03, బుధవారం) : గూడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో గూడూరును జిల్లా చేయాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 185వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రిలే దీక్షల నిర్వాహకులు, భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల్ నాయుడు మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా దీక్షా శిబిరంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో యారం వెంకట సుబ్బయ్య, మంజులమ్మ, శ్రీగౌరి, ఎల్లసిరి సుబ్బారెడ్డి, అళగర్, పంటా శ్రీ నివాసులు రెడ్డి, చిరంజీవి, చంద్రశేఖర్, కనగలూరు చంద్రశేఖర్, సీ. శేఖర్ యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ యూనిట్ సమావేశంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 03, బుధవారం) : గూడూరు 2వ పట్టణం 4వ క్లస్టర్ 18, 15 యూనిట్ సమావేశాలలో యూనిట్ ఇంచార్జ్ లు అబ్దుల్ రహీమ్, ఇశ్రాయేల్ కుమార్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్స్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బిల్లు చెంచురామయ్య, ఎండీ. అబ్దుల్ రహీం, ఇజ్రాయేల్ కుమార్ తదితరులు మాట్లాడుతూ పేదల పక్షపాతి, ప్రజాసేవకుడైన ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రాజకీయంగా ఇంకా ఉన్నత పదవులు పొంది ప్రజాసేవలో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ క్లస్టర్ ఇంచార్జ్, యూనిట్ ఇంచార్జ్ లు, యూనిట్ కో ఇంచార్జ్ లు, బూత్ కన్వీనర్ లు, బూత్ కో కన్వీనర్ లు, ఏఎంసి డైరెక్టర్, దేవస్థానం మెంబర్లు, వార్డుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహిళపై అత్యాచారం.. నిందితుడి అరెస్ట్: సీఐ




పల్లె వెలుగు ప్రతినిధి (పొదలకూరు, జూన్ 03, బుధవారం) : మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పొదలకూరు సీఐ వెంకట్రావు తెలిపారు. మనుబోలు మండలం కాగితాలపూరు హైవేపై మూడు రోజుల క్రితం మానసిక స్థితి సక్రమంగా లేని మహిళపై అత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నెల్లూరు టౌన్ హౌస్ పేటకు చెందిన వెంకటేశ్వర్లును అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్ తరలించారు.

# పేదలకు సేవ చేయడమే సిఆర్ ఫౌండేషన్ లక్ష్యం

- **చావా వాసుదేవ రావు దాతృత్వం అభినందనీయం**
- **సిఆర్. ఫౌండేషన్ కు ఎకరా వితరణ**
- **సిఆర్. ఫౌండేషన్ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, డాక్టర్ కె. నారాయణ వెల్లడి**

పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 03, బుధవారం) : చిల్లకూరు మండల పరిధిలోని పారిచేర్ల వారి పాలెంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త చావా వాసుదేవ రావుకి చెందిన ఎకరా భూమిని బుధవారం గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిఆర్ ఫౌండేషన్ కు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా సిఆర్. ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా సీఆర్. ఫౌండేషన్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. హైదరాబాదులో ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్ దేశంలోనే అత్యంత పేరు ప్రతిష్టలు సంపాదించి 150 మంది సీనియర్ సిటిజన్లకు ఆసరాగా ఉందన్నారు. సిఆర్. ఫౌండేషన్ తరపున ఒక మహిళ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, సీఆర్. పాలి క్లినిక్, ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్, విశాలమైన గ్రంథాలయం, తదితర కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే గుంటూరులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సీఆర్. ఫౌండేషన్ పేరుతో ఓల్డ్ ఏజ్ హోమ్, అనాధ పిల్లల ఆశ్రమం నిర్మించనున్నట్లు తెలిపారు. కడపలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఆశ్రమాన్ని వచ్చే నెల ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరులో చావా వాసుదేవరావు దాతృత్వంలో వారి సతీమణి, కుమారుడు చావా హర్షవర్ధన్ పేరుతో సీఆర్. ఫౌండేషన్ కు అనుబంధంగా ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కే.నారాయణ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు వాసుదేవరావు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర



ఉపాధ్యక్షులు ఏ. రామానాయుడు, బీకేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్, చావా వాసుదేవ రావు, ఆయన కుమారుడు చావా హర్షవర్ధన్, అమరావతి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రమణయ్య, డాక్టర్ నిర్మల, సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, పట్టణ కన్వీనర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ జన్మదిన సంబరాలు..

- **డ్రోన్ తో పాలాభిషేకం...**
- **భారీగా బాణాసంచా..**
- **వాకాడులో పండుగ వాతావరణం..**

పల్లె వెలుగు ప్రతినిధి (వాకాడు, జూన్ 03, బుధవారం) : గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ జన్మదిన సంబరాలు బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన వాకాడు అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద టీడీపీ యువ నాయకులు చరణ్ రెడ్డి, అరుణ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా, అట్టహాసంగా



నిర్వహించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ 30 అడుగుల భారీ కటౌట్ ను నెలకొల్పి, డ్రోన్ తో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. భారీ బాణాసంచా ధ్వనులు నడుమ ఆ కటౌట్ వద్ద సంబరాలు నిర్వహించారు. భారీ కేక్ ను టీడీపీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా కట్ చేయించారు. అక్కడికి చేరిన నాయకులు, కార్యకర్తలకు కేకు, మిఠాయిలను చరణ్ రెడ్డి, అరుణ్ పంపిణీ చేశారు. తమ నాయకుడు ఆయుష్షు, ఆరోగ్యం, సిరి సంపదలు, రాజకీయాలలో ఉన్నత పదవులు అధిరోహించాలని విశేష ప్రార్థనలు చేశారు.

# గూడూరులో ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**-అన్నదానం, చీరల పంపిణీ**





పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 03, బుధవారం) : గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ జన్మదినం సందర్భంగా బుధవారం గూడూరు పట్టణంలోని అన్నా క్యాంటిన్లో పేదలకు భోజనం పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా నాయకులు చిల్లకూరు పట్టాభిరెడ్డి, దువ్వూరు రవీంద్ర, సునీల్ వేముల రెడ్డిలు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమంలో నాయకులు భారీగా పాల్గొన్నారు. గమళ్లపాలెంలో : గూడూరు పట్టణంలోని గమళ్లపాలెంలో టిడీపీ పట్టణాధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సచిన్ పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండాల లీలావతి, వాటంబేటి హరి కుమార్, దువ్వూరు రవీంద్ర రెడ్డి, రావూరు సురేంద్ర, పేప్పాళ్ల అమరయ్య నాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ కాలువ ఆక్రమణపై డీడీవో ఆకస్మిక తనిఖీ



పల్లె వెలుగు ప్రతినిధి (వాకాడు, జూన్ 03, బుధవారం) : వాకాడు మండలంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత కార్యక్రమం భాగంగా వాకాడుకు విచ్చేసిన సందర్భంగా, వాకాడు చర్చ్ కాంపౌండ్ కెవిసి ప్రెసిడెంట్, టీడీపీ నాయకుడు వేము దినకర్ బాబు రెవెన్యూ సదస్సులో నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమక్షంలో ఇచ్చిన అర్జీ ఆధారంగా, తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సూళ్లూరుపేట డివిజన్, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డిడిఓ చిన్న రెడ్డప్ప వాకాడు గ్రామ డ్రైనేజీ కాలువ ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని ఎంపీడీవో శ్రీ సాయి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, ఏవో శ్రీనివాసులుతో కలసి ఆక్రమణ ప్రదేశాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఆక్రమణలపై తక్షణమే సర్వేయర్తో కొలతలు వేయించి, హద్దులు నిర్ణయించి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ ను ఆదేశించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులు డిడిఓ చిన్న రెడ్డప్ప మీడియాతో మాట్లాడుతూ, వాకాడు మండల నిరుపేద ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలిగించినా చట్టపరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పంచాయతీలలో ప్రత్యేక అధికారులు ఎలాంటి రాజకీయ సిఫార్సులు తీసుకోకుండా రాజ్యాంగబద్ధమైన పనులు మాత్రమే చేపట్టాలి. అలాంటి ఉల్లంఘనలు నా దృష్టికి వస్తే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని వారు స్పష్టం చేశారు.

# కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్థంభం



పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 03, బుధవారం) : గూడూరు రెండవ పట్టణంలోని దేముడమ్మవీధి వినాయకుడు గుడి సమీపంలో ఉన్న విద్యుత్ స్థంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విద్యుత్ స్థంభాన్ని తొలగించి నూతన స్థంబాన్ని ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. ఎటువంటి ప్రమాదం సంభవించకముందే శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్న స్థంభం స్థానంలో నూతన విద్యుత్ స్థంభాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య




కట్టంగూర్ ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య బోధించడంతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పిస్తారని సర్పంచ్ శ్యామల శేఖర్ అన్నారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో మండల విద్యాధికారి అంబటి అంజయ్య, ఉప సర్పంచ్ గుండు రాంబాబు, వార్డు సభ్యులు అయితగోని సైదమ్మ, బొమ్మ మహేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అయితగోని ఝాన్సీ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ దోరెపల్లి పద్మావతి, అంగన్వాడి టీచర్లు ఉన్నారు.